

బంజారాహిల్స్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



లక్ష్మీనరసింహ నగర్‌లో మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేషన్ చైర్మన్‌లు లక్ష్మణ్ యాదవ్, శివసేనారెడ్డి, నాయకులు ఫిరోజ్ ఖాన్, మహేందర్ యాదవ్, ప్రేమ్, రాజేష్, సుకన్య, పద్మ, పవన్, చిన్ను

ఖైరతాబాద్ గణేశ్ వద్ద భారీ ఏర్పాట్లు

ఖైరతాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణేశ్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మండపంతో పాటు నాలుగువైపులా బారీకేడ్లను ఏర్పాటు చేసి వీవీఐపీలు వచ్చే సమయంలో భక్తులను నియంత్రించేందుకు ఏర్పాట్లు చేశారు. పలు జిల్లాల నుంచి మంగళవారం మధ్యాహ్నానికి చేరుకున్న అదనపు పోలీసు అధికారులు, సిబ్బందికి స్థానిక ఏసీపీ, ఇన్‌చార్జి అధికారి ఆర్.సంజయ్ కుమార్ విధుల నిర్వహణ గురించి చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు పార్కింగ్‌తోపాటు భక్తుల రద్దీతో ఏర్పడే ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, అదనపు డీసీపీ రాములు, ఏసీపీ మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సైదులు ఏర్పాట్లపై సమీక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. ఇక రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది బారీకేడ్లను ఏర్పాటు చేయగా, అవసరం మేరకు వారు ఇతర పనుల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్ శాఖ ద్వారా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి వెలుగులను అందిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందిని మూడు షిఫ్టుల్లో నియమించి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడంతోపాటు చెట్ల కొమ్మలను నరికించడం, గుంతలను పూడ్చే పనులను పూర్తి చేశారు. వీటితో పాటు జలమండలి, హెచ్‌ఎండీఏ, నీటిపారుదల శాఖ తదితర విభాగాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి.

అన్ని శాఖల సమన్వయంతో..

అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఖైరతాబాద్ గణపతి వద్ద భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. బుధవారం గవర్నర్‌తో పాటు ప్రముఖులు పూజలకు రానుండడంతో ఆయన ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పలు శాఖల అధికారులతో ఏర్పాట్లను సమీక్షించారు. స్థానిక శాఖ మైదానంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పోలీసులు స్థానికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారికి సహకరిస్తారని ఆయన తెలిపారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

మండపాల వద్ద నిబంధనలు పాటించాలి

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, పోలీసులు చెప్పిన జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి సూచించారు. ఈ మేరకు మండపాల నిర్వాహకులతో డీసీపీ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.



బేగంపేటలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి



హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మట్టి గణపతుల విగ్రహాలను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్



వెంగళరావునగర్ కాలనీలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు పూస రాజు, జబ్బార్, సుప్రియాగౌడ్, కిట్టు, తదితరులు



వెంకయ్యనాయుడుకు శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందజేస్తున్న ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి

ప్రజా సేవతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

బేగంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజా సేవ చేయడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మంగళవారం ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కమ్మ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి తరగతులు నిర్వహించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ ఇదే తరహాలో కార్యక్రమాలను నిర్వహిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్ నగర్ కమ్మ సంఘం అధ్యక్షుడు సూరినేని మోహన్‌నాయుడు, కార్యదర్శి ముక్కపాటి వీరరాఘవయ్య పాల్గొన్నారు.

ఏకే కీర్తి ప్రవాసి సమాజ్ ఆధ్వర్యంలో నేపాలీల సమ్మేళనం మహమూద్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ నేపాలీలు ఒకేచోట చేరి ఆటాపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దీపక్ రామ్ కుమార్, మాయాచాత్రీ తదితరులు పాల్గొన్నారు.



- యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు, అధ్యాపకులు

నిర్మాణ రంగంలో ఆర్కిటెక్చర్ల పాత్ర కీలకం

బంజారాహిల్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత నిర్మాణ రంగంలో ఆర్కిటెక్చర్ల పాత్ర ఎంతో కీలకంగా ఉందని జేఎన్‌ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్ అన్నారు. బంజారాహిల్స్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్(జేఎన్‌ఐఏఎస్ ఎస్‌పీయూఏ) విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగంలో ఆర్కిటెక్చర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. విద్యార్థులు ఆటా, పాటలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో జేఎన్‌ఐఏఎస్ డైరెక్టర్ హర్షద్ షిండే, హెచ్‌వోడీ కె.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై దాడి

బంజారాహిల్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఓ పబ్‌కు వెళ్లి పీకల దాకా తాగారు. అక్కడ నుంచి మరో హోటల్‌కు వెళ్లి అర్ధరాత్రి వరకు మరోసారి తాగారు. అదే మత్తులో జూబ్లీహిల్స్‌లో ఐస్‌క్రీం తినేందుకు రోడ్డు మీద కారు ఆపారు. ప్రశ్నించినందుకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పైన దాడి చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన యశ్వంత్, సంతోష్‌రెడ్డి, అరవింద్, పవన్‌తేజ, అభిషేక్ స్నేహితులు. వీరంతా కలిసి రెండు ఖరీదైన వాహనాల్లో ఈనెల 25న జూబ్లీహిల్స్‌లోని పబ్‌కు వచ్చి మద్యం తాగారు. సుమారు నాలుగు గంటలపాటు అక్కడే ఉండి నచ్చలేదని మాదాపూర్‌లోని హోటల్‌కు వెళ్లారు. అర్ధరాత్రి వరకు అక్కడే గడిపి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్.1లోని ఐస్‌క్రీం పార్లర్‌కు వెళ్లారు. కార్లను రోడ్డు మీదనే పార్క్ చేయడంతో అప్పుడే విధులు ముగించుకొని హైటెక్‌సిటీ నుంచి వారాసిగూడ వెళ్తు న్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఫిరోజ్ ప్రశ్నించాడు. కారు నుంచి దిగిన అభిషేక్, యశ్వంత్ ఫిరోజ్‌పై దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు కార్లను సీజ్ చేసి జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కేబుల్ వైర్లు తొలగింపు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్ ఏ, బీ బ్లాక్‌లలో అనుమతి లేకుండా కరెంటు స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్ నెట్ వైర్లను విద్యుత్ శాఖ ఏఈ జాన్ పీటర్ ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగిస్తున్నామని ఏఈ తెలిపారు.

సీఎం ప్రజావాణికి 282 దరఖాస్తులు

బేగంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 282 దరఖాస్తులు వచ్చాయి. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు చెందినవి 107, రెవెన్యూకు 48, విద్యుత్ శాఖకు 17, ఇందిరమ్మ ఇళ్ల కోసం 58, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇతర శాఖలకు చెందిన 51 దరఖాస్తులు వచ్చినట్లు దివ్య దేవరాజన్ తెలిపారు.

త్వరలో దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే దాదాపు 8 వేల మంది దివ్యాంగులకు ఉచితంగా వివిధ రకాల పరికరాలను అందజేయనున్నట్లు వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. యూసుఫ్‌గూడలోని పీజేఆర్ కమ్యూనిటీ హాల్‌లో దాదాపు వంద మంది దివ్యాంగులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాల గురించి వివరించారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

బోరబండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో పేదలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్, వివిధ శాఖల అధికారులతో కలిసి పెద్దమ్మ నగర్, అన్నా నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, ఏఎంఓహెచ్ శివ, శానిటరీ జవాన్ చందు, ఏఈఈ భరత్, సీపీడీసీఎల్ ఏఈ రంజిత్, జలమండలి ఎస్సార్ హిల్స్ సెక్షన్ మేనేజర్ రాజేంద్ర, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు, బోరబండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి అశోక్, జూపల్లి రేణుక, చీకోటి కవిత, మున్నీబేగం, మహబూబ్‌బీ, లక్ష్మీనాయక్, తిరుతమ్మ, చంద్రకళ, ఆరుద్ర, షైక్ వలీ, వినయ్, మున్నా, కృష్ణ, రంగనాయక్, మునీర్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

పాన్‌బ్రోకర్ దుకాణం ఎదుట ఆందోళన

- తాకట్టు పెట్టిన నగలు ఇప్పించాలని డిమాండ్

బంజారాహిల్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తాకట్టు పెట్టిన నగలతో ఉడాయించిన వ్యాపారిని వెంటనే పట్టుకొని తమ నగలు ఇప్పించాలని కోరుతూ బాధితులు డిమాండ్ చేశారు. రాజస్థాన్‌కు చెందిన మాణిక్ చౌదరి 20 సంవత్సరాల క్రితం ఫిలింనగర్‌లో మాణిక్ జువెలరీ పేరిట పాన్ బ్రోకింగ్ దుకాణం తెరిచాడు. నమ్మకంగా ఉన్నట్టు నటించి వారం క్రితం బంగారు ఆభరణాలతో ఉడాయించాడు. అంతేగాక అధిక వడ్డీ ఇస్తానని ఆశ చూపి పలువురు వద్ద లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. నలుగురు బాధితుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా, మరికొంతమంది బాధితులు మంగళవారం మాణిక్ షాప్ ఎదుట ఆందోళనకు దిగారు. అతడిని వెంటనే అరెస్టు చేసి తమ డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బాధితులకు మద్దతు ప్రకటించాడు. త్వరలోనే పోలీసు కమిషనర్‌ను కలవనున్నట్లు ఆయన చెప్పారు.

ఒక్కొక్కరిది ఒక్కో గాథ..

ఓ మహిళ నాలుగు గ్రాముల బంగారు ఆభరణం తాకట్టు పెట్టి పది వేల రూపాయలు అప్పుగా తీసుకుంది. వారం క్రితం చెల్లించేందుకు వెళ్లగా రెండు రోజుల తర్వాత రావాలని మాణిక్యం సూచించాడు. ఆమె రెండు రోజుల తర్వాత రాగా షాపు మూసి ఉంది. ఓ వ్యక్తి ఆరున్నర తులాల బంగారం తనకా పెట్టి రూ.3 లక్షలు తీసుకున్నాడు. డబ్బు తిరిగి చెల్లించిన అనంతరం వారం రోజుల్లో నగలు తిరిగి ఇస్తానని చెప్పిన మాణిక్యం పరారయ్యాడు.



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుతున్న రాఘవరెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

వెంగళరావునగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జవహర్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

కృష్ణానగర్‌లో ‘హైడ్రా’ నాలా ఆపరేషన్



వెంకటగిరి నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్



వ్యర్థాలను ఎత్తిపోస్తున్న సిబ్బంది

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లో నాలా లోతు 8 అడుగులుంటే, అందులో 6 అడుగుల మేర సిల్ట్ పేరుకుపోయిన దృశ్యాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. రెండు మీటర్ల మేర పూడికను తీస్తే.. ఏడెనిమిది ట్రాక్టర్లు నిండుతున్న పరిస్థితి అక్కడ నెలకొంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం నాలా క్లీనింగ్ పనులను పరిశీలించారు. 20 రోజులైనా పనులు పూర్తి చేయాలని సూచించారు. నాలాలో ఉన్న పూడిక మొత్తం తొలగితే గాయత్రి హిల్స్, యూసుఫ్‌గూడ బెటాలియన్, వెంకటగిరి ప్రాంతాల నుంచి వచ్చే వరద చాలా వరకు సాఫీగా వెళ్లడానికి వీలుంటుందని స్థానికులు చెబుతున్నారు.

నాలా ఆక్రమణలపై కమిషనర్ ఆగ్రహం

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.1లో జీవీకే డయాగ్నస్టిక్స్ వద్ద నాలాపై షెడ్లు వేయడాన్ని రంగనాథ్ తీవ్రంగా పరిగణించారు. వెంటనే నాలా ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. 5 మీటర్ల విస్తీర్ణంలో ఉండాల్సిన నాలాను కేవలం 2 మీటర్లకే పరిమితం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జూబ్లీహిల్స్ చెక్ పోస్టు సమీపంలో సోమవారం ఆక్రమణలు తొలగించిన రెండువేల గజాల స్థలాన్ని ఆయన పరిశీలించారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని కాపాడాలని అధికారులను ఆదేశించారు.

తప్పుడు వార్తలు రాయవద్దు : రఘునందన్‌రావు

పంజాగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తప్పుడు వార్తలు రాయవద్దని, ఎవరి చేతుల్లో బలిపశువు కావద్దని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు జర్నలిస్టులకు సూచించారు. ఏదైనా అంశంపై కథనం రాసే ముందు సంబంధిత వ్యక్తుల వివరణ తీసుకోవాలని, వారు మాట్లాడడానికి స్పందించకపోతే స్పందించడం లేదని రాయాలని ఆయన సూచించారు.తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కప్పర ప్రసాద్ అధ్యక్షతన ‘డిజిటల్ మీడియా చట్టాలు’ అనే అంశంపై మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఇందులో యూనియన్ నాయకులతో పాటు డిజిటల్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ సంఘటితంగా ఉండి పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. జర్నలిస్టులు తమ హక్కులు, పరిధులు ఏమిటో తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాద్ పలు అంశాలను ప్రస్తావించారు. అనంతరం తమ యూనియన్ కు అనుబంధంగా ఏర్పాటు చేసిన డిజిటల్ మీడియా కమిటీ కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు.



తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ నాయకులతో ఎంపీ రఘునందన్‌రావు

కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఉపాధ్యక్షుడు నరసింహ, కార్యదర్శి భరత్‌శర్మ, నిర్మల, సునీత, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు కార్మికులకు ఓటీ రిలీజ్

- ఎండీతో మధుయాష్కీగౌడ్, బొంతు రామ్మోహన్ భేటీ



వాటర్‌బోర్డు ఎండీకి వినతిపత్రం ఇస్తున్న మధుయాష్కీగౌడ్, రామ్మోహన్

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వాటర్ బోర్డు కార్మికులకు రావాల్సిన ఓవర్ టైమ్(ఓటీ) డ్యూటీ నిధులను ఎండీ అశోక్‌రెడ్డి విడుదల చేశారు. మాజీ ఎంపీ, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మంగళవారం వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమై కార్మికుల ఓటీ సమస్యను పరిష్కరించాలని కోరారు. వాటర్‌బోర్డు ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎండీ వెంటనే ఫైనాన్స్ విభాగం అధికారులతో మాట్లాడి, జూలై వరకు బకాయి ఉన్న ఓటీ అలవెన్స్‌లను విడుదల చేయాలని ఆదేశించారు. ఫైనాన్స్ అధికారులు సైతం ఓటీ అలవెన్సులు విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో రెండు గంటల వ్యవధిలోనే సమస్య తీరడంతో వేలాది మంది కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నెలా పదో తేదీలోపు ఓటీ అలవెన్స్ లిస్టు పంపిస్తే 15వ తేదీ వరకు కార్మికులకు అందుతాయని పేర్కొన్నారు. త్వరలో యూనియన్ ఎన్నికలపైనా తగు నిర్ణయం తీసుకునేలా మాట్లాడుతామన్నారు. కార్యక్రమంలో జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు, రాజిరెడ్డి, ఎండీ జహంగీర్ పాల్గొన్నారు.

బీజేపీ సెంట్రల్ జిల్లా కార్యదర్శిగా సుప్రియాగౌడ్



సుప్రియాగౌడ్

వెంగళరావునగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా కార్యదర్శిగా వెంగళరావునగర్ కాలనీకి చెందిన సీనియర్ నాయకురాలు ఎం.సుప్రియాగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి మంగళవారం నియామక ఉత్తర్వు జారీ చేశారు. ఈ సందర్భంగా సుప్రియాగౌడ్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

నేడు వినాయక చవితి

కొనుగోలుదారులతో మోండా మార్కెట్ కళకళ



గణపతులు



పంచెలు, కండువాల కొనుగోలులో..

అన్ని విఘ్నాలను తొలగించే వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. లంబోదరుడ్ని ప్రతిష్ఠించి, పూజించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మరోవైపు బుధవారం గణేష్ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సికింద్రాబాద్ మోండా మార్కెట్ కొనుగోలుదారులతో కళకళలాడింది. గణపతి పూజకు ఉపయోగించే పసుపు, కుంకుమ, పూలు, పత్రి తదితర పూజాసామగ్రితో పాటు పంచెలు, కండువాల దుకాణాలు కిటకిటలాడాయి. దీంతో మార్కెట్ పరిసరాలు సందడిగా మారాయి.

- సికింద్రాబాద్, రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి)



అరిటాకుల కొనుగోలులో



పత్రి కొనుగోలులో

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

● మండపాల వద్ద భారీ బందోబస్తు: ఏసీపీ శశాంక్‌రెడ్డి



శశాంక్‌రెడ్డి, ఏసీపీ, చిలకలగూడ డివిజన్

బౌద్ధనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రోత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఈస్ట్ జోన్ చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి కోరారు. డివిజన్ పరిధిలో చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ మండపాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం బౌద్ధనగర్ ఏసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా మండపాల వద్ద నిర్వాహకులు అందుబాటులో ఉండాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మండపాల వద్ద కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తున్నట్లు ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కాని, 100కాని ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు చిలకలగూడ పీస్ పరిధిలో 350 విగ్రహాలు, వారాసిగూడ పీస్ పరిధిలో 250 విగ్రహాలు, లాలాగూడ పీస్ పరిధిలో 155 వినాయక విగ్రహాలకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. సిద్దిపేట, నల్గొండ జిల్లాల నుంచి సుమారు 350 మంది పోలీసులను ప్రత్యేక బందోబస్తుకు గణేశ్ ఉత్సవాల వచ్చారని తెలిపారు.



రాజ్‌కుమార్‌గౌడ్ అంతిమయాత్రలో పాడె మోస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాజ్‌కుమార్‌గౌడ్‌కు అంతిమ వీడ్కోలు

మారేడుపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకుడు మూల రాజ్ కుమార్ గౌడ్ సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. బంధువులు, మిత్రులు, కుటుంబ సభ్యులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని నివాసం నుంచి వైఎంసీఏ వరకు సాగిన అంతిమయాత్రలో తలసాని రాజ్ కుమార్ గౌడ్ పాడె మోశారు. అనంతరం రాయదుర్గంలోని గౌడ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. తలసాని సాయికిరణ్ యాదవ్, బోయినపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముప్పిడి గోపాల్, బేవరేజెస్ మాజీ ఛైర్మన్ గజ్జల నాగేష్, ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు పలువురు ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జాతీయ ఫిస్ట్ బాల్ జట్టుకు కిట్లను అందించి శుభాకాంక్షలు తెలిపిన జంపన ప్రతాప్

జాతీయ ఫిస్ట్ బాల్ క్రీడల్లో తెలంగాణ జట్టు రాణించాలి

బోయినపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. 28 నుంచి 30 వరకు చెన్నై దుండిల్‌లో 12వ సీనియర్ నేషనల్ ఫిస్ట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు సంబంధించిన రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక జరిగింది. ఈ క్రమంలో క్రీడల్లో పాల్గొనడానికి జట్టు మంగళవారం బోయినపల్లి ప్లే గ్రౌండ్ నుంచి చెన్నైకి బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంపన్న క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోటీల్లో తెలంగాణ జట్టు ఘన విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్, సభ్యులు జగదీష్, జాయింట్ సెక్రటరీ జయరాజ్, మునిరాజ్, సత్యనారాయణ, వరప్రసాద్, ఫిస్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కొమ్ము వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మండపంలో కొలువుదీరిన గణేశుడు



శ్రీ సిద్ధి గణేష్ మహోత్సవ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ వైఎంసీఏ ఆవరణలో ఆదర్శ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 21 అడుగుల ఎత్తు గల కల్యాణ వినాయకుడు మంగళవారం సాయంత్రం కొలువుదీరాడు.

- మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి

మట్టి గణపతే.. మహాగణపతి

పలు ప్రాంతాల్లో ఉచితంగా విగ్రహాల పంపిణీ



నామాలగుండు వార్డు కార్యాలయం వద్ద మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

బౌద్ధనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నడటంతో మంగళవారం సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో మట్టిగణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. నామాలగుండు వార్డుకార్యాలయం వద్ద జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ స్థానికులకు గణపతులను పంపిణీ చేశారు. మట్టి గణపతులను పూజిద్దామని, పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వారాసిగూడ చౌరస్తాలో బౌద్ధనగర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మట్టిగణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలంధర్‌రెడ్డి, లింగారెడ్డి, బబ్లూ, చక్రధార్, వాహీదుద్దీన్, శిల్పాచారి తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌గడ్డలో వాసవీ బంధన్ గ్లోబల్ ఫౌండేషన్(వీబీజీఎఫ్), నామాలగుండు ఆర్యవైశ్యసంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. వాసవీ బంధన్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎం.రాజు మట్టిగణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టి.విశ్వేశ్వరరావు, శ్రీరామరాజు ప్రభాకర్, రాఘవేంద్ర రాజు, సకిలం రాజు తదితరులు పాల్గొన్నారు.

వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో శ్రీగణేశ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపానికి నిర్వాహకులు ఆగమన్ కార్యక్రమాన్ని నిర్వహించిన గణపతి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చారు.

రాంగోపాల్‌పేట్‌లో..

మట్టి గణపతుల ఏర్పాటు పర్యావరణహితంగా ఉంటుందని ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలో మక్తాల ఫౌండేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకులు, తులసి మొక్కల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తగిన భద్రతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జలంధర్ గౌడ్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 సంవత్సరాలుగా మట్టి గణపతులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అశోక్, ఇన్‌స్పెక్టర్లు పరశురాం, నర్సింగరావు, రామకృష్ణ, ఎస్సైలు, మక్తాల ఫౌండేషన్ సభ్యులు నరసింహచారి, సూర్యప్రకాష్, వెంకటేష్, వేణు, ప్రకాష్, మధుసూధన్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, పూర్ణచందర్, శివకుమార్, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో..

మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని బ్రైట్ ఫ్యూచర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ సంస్థకు చెందిన ప్రతినిధులు స్వయంగా మట్టితో విగ్రహాలను తయారు చేసి మంగళవారం బోయినపల్లి, బాలానగర్, సికింద్రాబాద్‌లతో పాటు పలు ప్రాంతాల్లో స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి స్వర్ణ మాట్లాడుతూ పర్యావరణానికి హానికలగనివిధంగా వినాయక చవితి పండుగను ప్రజలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెప్సిబ, దివ్య ప్రియాంక, నవీన్, ఉమామహేశ్వరి, శ్రీదేవి, శివ, విజయ్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో

పర్యావరణాన్ని కాపాడుకోవటానికి మట్టి వినాయకుల్ని పూజించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య భక్తులకు సూచించారు. మంగళవారం తుకారాంగేట్ చౌరస్తాలో జైభీం మాల మహాసేవా సంఘం ముఖ్య సలహాదారుడు నక్కా మధు, మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి జయకుమార్, సికింద్రాబాద్ అధ్యక్షుడు నేతల రమేష్, మహేందర్, మహిళా అధ్యక్షురాలు రమాదేవీ, పుష్ప, పద్మ, జవాజీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ చేతుల మీదుగా..

అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ చేతుల మీదుగా భక్తులకు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.



వారాసిగూడ చౌరస్తాలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, నక్కామధు తదితరులు



వినాయక విగ్రహాలు, తులసి మొక్కలను పంపిణీ చేస్తున్న డీసీపీ రష్మీ పెరుమాళ్, అదనపు డీసీపీ అశోక్, మక్తాల జలందర్ గౌడ్ తదితరులు



జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతులను మంగళవారం మోండా డివిజన్‌లోని పరికిబస్తీ, చీపురు బస్తీ, రెజిమెంటల్‌బజార్, కుమ్మరిగూడ, గాస్మండి ప్రాంతాల్లో కార్పొరేటర్ కొంతం దీపిక పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకా రెడ్డి మంగళవారం తార్నాకలోని గణపతి దేవాలయంలో పర్యావరణ పరిరక్షణపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండ శివారెడ్డి, వీరన్న, కొన్నె సంపత్, శ్రీనివాసా చారి, అనిత తదితరులు పాల్గొన్నారు.



మెట్టుగూడలో వినాయక చవితిని పురస్కరించుకుని కార్పొరేటర్ రాసూరి సునీత మంగళవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు

- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి

విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి

జనరల్ బజార్ సెక్షన్‌లో విద్యుత్ ఉన్నతాధికారుల పర్యటన





విద్యుత్ సమస్యలను పరిశీలిస్తున్న మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, ఎస్‌ఈ గోపయ్య, డీఈ బ్రహ్మానందం తదితర ఉన్నతాధికారులు

సికింద్రాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జనరల్ బజార్ సెక్షన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. జనరల్ బజార్ పరిసరాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ తలెత్తుతున్న అంతరాయాలకు చెక్ పెట్టడం, ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లను ఆనుకుని వేలాడుతూ ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించిన విద్యుత్ తీగలను తొలగించడం, వాటిని ప్రమాదరహితంగా ఏర్పాటు చేయడం తదితర పనులపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. మంగళవారం బర్తన్ కాంపౌండ్ పరిసరాల్లో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది పర్యటించారు. మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, ఎస్‌ఈ గోపయ్య, డివిజనల్ ఇంజనీర్ బ్రహ్మానందం, ఏడీఈలు శివప్రసాద్, ఆదినారాయణ, జనరల్ బజార్ ఏఈ కాసం రవికుమార్ తదితర అధికారులు స్థానికంగా విద్యుత్ సమస్యలు తలెత్తడానికి గల కారణాలు, పరిష్కరించడానికి తీసుకోవలసిన చర్యలపై అధ్యయనం చేశారు.

ఆయా సమస్యలను గుర్తించిన ఉన్నతాధికారులు సత్వరమే పరిష్కార చర్యలకు శ్రీకారం చుట్టడం గమనార్హం. బస్తీలో ఉన్న ప్రమాదకర సర్వీసులను తొలగించాలని, కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి, సర్వీసులు విభజించాలని చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ ఆదేశించారు. దాంతో వెంటనే ప్రమాదకర సర్వీసుల తొలగింపు పనులను సిబ్బంది ప్రారంభించడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సరోజినీదేవి రోడ్డులోని విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ వైర్లు ప్రమాదకరంగా మారడాన్ని గమనించిన అధికారులు వాటిని తొలగించారు.





వినాయక చవితి సందర్భంగా సికింద్రాబాద్ పాట్ మార్కెట్ వద్ద గణేశ్ మండపం, వైఎంసీఏ వద్ద గణేశ్ దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో చూపరులను ఆకట్టుకునేవిధంగా అలంకరించారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి



టీడీపీ నాయకుడు గౌరీశంకర్ యాదవ్, రెవరెండ్ ఫాదర్ అల్లం ఆరోగ్యరెడ్డి

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మానవత్వపు సహజ గుణాలు సమాజానికి ఎల్లప్పుడు అవసరమని తన సేవల ద్వారా నిరూపించిన మహోన్నత వ్యక్తి మానవతవాది, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. మంగళవారం మదర్ థెరిసా జయంతి సందర్భంగా సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, నగేష్ యాదవ్, బద్రినాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, ప్రభాకర్ యాదవ్, వెంకట్ రాజు, శ్రీనాథ్, శేఖర్ ముదిరాజ్, ధనలక్ష్మీ, వరలక్ష్మీ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవ సంఘాల ప్రతినిధులు మత్తయ్య, స్వరూప రాణి తదితరులు

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో..

టీడీపీ నాయకులు గౌరీశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మదర్ థెరిసా జయంతి కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ అల్లం ఆరోగ్య రెడ్డి, రెబెకా, మైఖెల్, సంజయ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో...

ఎన్జీవో నెట్‌వర్క్స్ ఛైర్మన్ ఎడ్వర్డ్ సామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మదర్ థెరిసా జయంతి వేడుకల్లో క్రైస్తవ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు జెరుషలేం మత్తయ్య, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ స్వరూప రాణి,ఆర్ మోజెస్,డేవిడ్ రాజ్,పివి యోహన్,అశోక్, రాజు, సోలొమోను తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, కాంగ్రెస్ నాయకులు

సీపీజీఈటీ-2025లో స్పోర్ట్స్ కోటా అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సీపీజీఈటీ-2025లో స్పోర్ట్స్ కోటా అమలు చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూ సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యామండలి నిర్వహించే అన్ని సెట్ పరీక్షల్లో స్పోర్ట్స్ కోటా అమలు చేస్తున్నప్పటికీ, సీపీజీఈటీలో మాత్రం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల క్రీడాకారులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా సీపీజీఈటీ- 2025లో కొన్ని సబ్జెక్టులకు (ఎంఏ మరాఠీ, ఎంఏ ఉర్దూ, ఎంఏ పర్షియన్, ఎం.ఎస్‌సి ఎలక్ట్రానిక్స్) దరఖాస్తులు తక్కువ సంఖ్యలో రావడంతో సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. సరైన ప్రచారం లేకపోవడం ఇందుకు కారణమని, దరఖాస్తుదారులకు మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగ బాలికలకు మరిన్ని ఒకేషనల్ సెంటర్లు

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల బాలికల కోసం ఆంధ్ర మహిళా సభ ఒకేషనల్ కేంద్రం మాదిరిగా మరిన్ని సెంటర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ పేర్కొన్నారు. విద్యానగర్‌లోని ఆంధ్ర మహిళా సభ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దివ్యాంగుల ఒకేషనల్ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వచన్‌కుమార్, వందనగౌడ్, చందనరాజ్, సరిత గోపాల్, ప్రేమలత ఆగర్వాల్, అపర్ణ బండి, టీపీసీసీ కార్యదర్శి జీ.ఎన్.కేశవ్, నాయకులు వెంకన్న, బల్వంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.